

ఆకాశం విరిగి భూమిమీద పడినట్లు ఫెడేల్న పెద్ద చప్పుడైంది. పళ్లెంలోంచి పైకి పెళ్లగించినట్లుగా భూమి ఒక్కసారి తలక్రిందులైపోయింది. పంచభూతాలూ ఒక్క క్షణం చోద్యం చూస్తూ తమతమ పనుల్ని మర్చిపోయాయేమో అనిపించింది. ఆ పెట్టెలో ఉన్నవాళ్లంతా ఒకరి మీద ఒకరు దొర్లిపడ్డారు. ఒక్క క్షణకాలం ఎవరి శరీరాలు వారికే పట్టుతప్పి ఊర్ధ్వ లోకంతోకి ప్రయాణ మవుతున్నట్లయింది. ఉండలుచుట్టుకుపోతున్న దేహాలనుంచి స్వేచ్ఛ పొందిన విహంగాల్లాగ ఏ అవయవానికి ఆ అవయవం ఎక్కడికో ఎగిరిపోతున్నాయి. తర్వాత ఆ ప్రదేశమంతా ఒకటే గోల — ఏడుపులూ, బాధతో కూడిన మూలుగులూ, కేకలు — అన్నిటితో నిండిపోయింది.

* * *

భాస్కరం కళ్లుతెరిచేసరికి ఓ పగలూ, ఓ రాత్రీ గడచిపోయినాయి. చుట్టూ ఉన్న పరికరాలూ, తలవైపున ఉన్న టెంపరేచరు ఛార్టు, మందు సీసాలూ—ఇవన్నీ చూసి తనొక హాస్పిటల్‌లో ఉన్నట్లు గ్రహించాడు. అప్పటి కతనికి బాగా తెలివి వచ్చేసింది. తనక్కడ కెలా వచ్చాడు ? రైలు ప్రమాదం జరిగింది .... తర్వాత ఏమయింది ? ఎంతమంది ప్రాణాలు నష్టపోయారు? ఇంత ఘోరానికి కారణం ఏవిటి ? .... భాస్కరానికి ఆతృత ఆగటంలేదు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. శరీరమంతా పచ్చిముద్దలాగ ఉంది, అక్కడక్కడ తగిలిన కవుకుదెబ్బలతో.

ఎదురుగా ఉన్న గుమ్మంలోంచి ఒక నర్సు నాలు గయిదు సంవత్సరాల పాపని నడిపించుకుంటూ వచ్చింది

“మీరు లేచారే ! కదలకుండా పడుకోండి. డాక్టరుగార్ని పిల్చుకువస్తాను” అంటూ తిరిగి వెళ్లబోయింది

“నర్స్ ! ఒక్క నిముషం అస లిక్కడి కెలా వచ్చాను ? రైలుప్రమాదం విశేషా లేమిటి ?



ప్రమాదానికి కారణం ఏవిటి ? ఇది ఏ ఊరు ?.... ఈ వివరాలు చెప్పండి దయచేసి. నాకేం ఫర్వా లేదు."

ఆతని ఆతృత చూసి చిన్నగా నవ్వుకుం డానర్సు.

"మీ ఆతృతకి అర్థముందిలెండి డాక్టర్ ! ఏం? ఆశ్చర్యపోతున్నారు ? మీరు డాక్టరని ఎలా తెల్సిందవా ? దానికేవుందిలెండి ! ఇక్కడ మిమ్మల్ని జాయిన్ చేయించినప్పుడే మీ జేబులో ఉన్న కాగితాల్నిబట్టి తెల్సింది. అప్పటికి మీ వంటిమీద స్పృహలేదు. ప్రమాదం జరిగి 6,7 గంటలు గడిచాకగాని ఇక్కడకు వార్త రాలేదు. గాయపడ్డవారందర్నీ ఇక్కడే జాయిన్ చేయించారు. ఎక్కువ ప్రాణనష్టంలేదు గాని—20, 25 మంది చనిపోయారని అంటున్నారు. మొదటి రెండు పెట్టెలు బాగా దెబ్బతిన్నాయి .... అన్నట్టు .... ఈ పాప మీ పాపేకదూ ?"

భాస్కరానికి నవ్వొచ్చింది. తనవైపే తదేక దీక్షతో చూస్తున్న ఆ పాపకేసి చూశాడతను. సరైన పోషణలేక శుష్కించిన శరీరం, కాంతి లేని ముఖం .... అయినా కళ్లలో ఏదో ఆకర్షణ ఉంది .... ఎవరిపాపోగాని.

"ఈ పాప నా తాలూకని ఎందు కనుకున్నారు" అని నవ్వి "నా జేబులోని కాగితాలే చెప్పాయేవిటి అదికూడా ?" అన్నాడు.

నర్స్ కొంచెం చిన్నబుచ్చుకుని నవ్వి "మిమ్మల్ని ఇక్కడకు తీసుకువచ్చిన వలంటీర్లు బహుశా ఈపాప మీతాలూకు అయివుండవచ్చు అని చెప్పి వెళ్లారు. డాక్టరుగారి కీసంగతి బాగా తెలుసు — ఆయన్ని పిలుస్తా ఉండండి ...."

నర్స్ వెళ్లిపోయాక బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు భాస్కరం. నీరసంగా ఉంది తప్పితే ఇంకేమీ బాధలు లేవనుకున్నాడు. రైలుప్రమాదాల్నిగురించి వినటమేగాని, ఆ ప్రమాదంలో తనూ ఓసారి యిరుక్కోవటం — అందులోనూ మొదటిసారి ఉద్యోగంలో ప్రవేశించటానికి వెళ్తుండగా — అదొక అశుభమా? అదృష్టమో, దురదృష్టమో తను బ్రతికాడు. చనిపోయి ఉంటే? తనకోసం ఏడ్చేవా రెవరు ? లలిత ఉంది .... కాని ఇంకా తన అర్ధాంగి కాలేదుగా ! కొన్నాళ్ళు తల్లుకొని తర్వాత మర్చిపోతుంది...

డాక్టరుగారు రావటంచూసి తన దృష్టి అటు మళ్లించుకున్నాడు.

"హల్లో ! మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషం ! ఎలాఉంది మీకు ? ...." చాలా ఆప్యాయంగా అడిగా డాయన.

"థాంక్యూ సార్ ! ఒక్క నీరసం తప్పితే ఏ బాధలూ లేవు...."

"అవునులెండి. ఎక్కడా దెబ్బతగలకుండా తప్పించుకున్నారు గమ్మత్తుగా. నాకు కూడా ఇలాంటి ప్రమాదం రుచిచూడాలని ఉందండి... ఓసారి అనుభవంగా ఉంటుంది...ముందు ముందు మా మనవలకి ఓ కథగా చెప్పుకోటానికి .... మనకి తెలియకుండా వళ్లంతా గబగబా పరువుచుట్టలాగా చుట్టుకుపోవటం, దభీమని ఓచోట పడ్డం, ఓ రెండ్రోజులు మరోప్రపంచంలో ఉండి తర్వాత తెలివిలోకి రావటం ...."

"ఏ కాలో, చెయ్యో విరిగితే ఇంచక్కా శాశ్వతంగా ఇంట్లో కూర్చోవటం . ..."

భాస్కరం అన్నదానికి డాక్టర్ గలగలా నవ్వేశాడు.

తర్వాత కొన్ని నిముషాలు ప్రమాదవిశేషాలు వివరించి చెప్పి డాక్టర్ హఠాత్తుగా....

"ఈ పాప మీ తాలూకు అయివుండవచ్చు అని చెప్పారు. మీరు కాదని అంటున్నారు. ఈ పాపని ఈ రెండ్రోజుల్లోనూ ఎందుకైనా మంచిదని అందరికీ చూపించాం. చనిపోయినవారితాలూకు పాప అవ్వచ్చు అనుకోవటం — అదీ కాదని నిర్ధారణగా తెలియటం అయిపోయింది. ఇంతవరకూ ఎవరూ ఈ పాపనిగురించి వాకబులు చెయ్యకపోవటం మరో ఆశ్చర్యం.

"అసలీపాప నా తాలూకని ఎందు కనుకున్నారు?"

"అది కేవలం ఊహ ! మీరు పడిఉన్న చోటనే ఈ పాప ఉంది. తెలివిలోనే ఉంది. మీమీద చెయ్యివేసుకుని ఏడుస్తూ కూర్చుంది. తర్వాత పాపని ప్రశ్నిస్తే మీరు తన బాబాయని చెప్పిందనుకోండి ...."

"ఆశ్చర్యంగా చూశాడు భాస్కరం పాపకేసి. పాప సిగ్గుతో తల వంచింది. చిన్నగా నవ్వుకున్నాడు భాస్కరం.

"పాపా ! నీపే రేవిటమ్మా ?" అని అడిగాడు. సిగ్గుతో మరీ తల వంచేసింది పాప.

"ఎంత సిగ్గో ! ఇలా దామ్మా .... ! రావాలి .... నేను బాబాయినికదూ !" నెమ్మదిగా భాస్కరం దగ్గరగా వచ్చి నుంచుంది పాప.

"ఆ ! అదీ .... ఇప్పుడు చెప్పు మరి—నీపేరేవిటి ?"

"పాప !" అంది నెమ్మదిగా నేలవైపు చూస్తూ ! తనమాటకి నవ్వుతున్న అందరివైపూ బెదురుతూ చూస్తున్న పాపని చూస్తూ.

"సర్లెండి భాస్కరం ! నెమ్మదిగా మీరు పాపని ప్రయత్నించండి. మీరు ఉద్యోగంలో ఎప్పుడు జాయినవ్వాలి ? మీ సామాను మీరు ఆనవాలుపట్టి తీసుకోవచ్చు. అన్నీ జాగ్రత్త చేశారు ...." అన్నాడు డాక్టర్.

"పెద్దసామాన్లేవీ లేవులెండి. ఓ పెట్టె, బెడ్డింగు, నా ఆర్డరుకాగితం జేబులోనే ఉండిపోవటం ఈవిధంగా లాభించింది. మీ ఆదరణ ఎన్నటికీ మర్చిపోలేను .... నన్నెప్పుడు వెళ్లమంటారు ?"

"రేపు వెళ్లవచ్చులెండి. ఇవాళ్టికి బ్రెడ్, పాలూ తీసుకోండి మీవాళ్ల కెవరికైనా కబురుచెయ్యాలా ?"

"అవసరం లేదులెండి. ఏమీ కంప్లయింట్స్ లేవుగా."

డాక్టర్ వెళ్లినతర్వాత ఆ గదిలో తనూ, పాపా మిగిలారు. పాప తనవైపు భయంతీరి చూస్తూంది, చూసి నవ్వుతోంది.

"మీ నాన్నపే రేమిటి పాపా ?"

"నాన్న .... !"

"నాన్న ఏం చేస్తాడు ?"

అర్థంకానట్టు చూసి, 'కొట్తాడు—' అని ఊరుకుంది క్రిందకు చూపు మళ్లించి. భాస్కరం మనస్సు ఆ అనుకోని జవాబుకు ఆర్ద్రమైపోయింది తనడిగిన ప్రశ్న పాప కింకోకలా అర్థమైనప్పటికీ, మరోసత్యం గోచరించింది ఆ జవాబులో ....

"నాన్న కొట్టితే అమ్మ ఏం చేస్తుంది ?"

ఒక్కసారి ఉలిక్కిపడి చూసింది పాప. ఆ కళ్లలో భయం ఆవరించి ఉండటం చూశాడు

భాస్కరం. ఏమిటి దీని అర్థం ? తల్లి అంటే భయంపెంచుకున్న ఈ పసిహృదయం ఎంత బాధపెట్టబడి ఉండాలి ? కన్నతల్లి ఏ బిడ్డకయినా తనపై భయం కల్గేటట్లు ప్రవర్తిస్తుందా ? తిరిగి అదేప్రశ్న వేశాడు భాస్కరం. ఈసారి పాప ముల్లుగుచ్చిన లేతాకులాగ వణికిపోయింది. కళ్లంట గిర్రున నీళ్లు తిరిగాయి. వస్తూన్న ఏడుపు మింగుతూ.

"అమ్మకాదు .... పిన్ని .... పిన్నికూలా కొల్తుంది" అంది. అని మంచంమీద తల దోపుకుని ఏడుస్తున్న పాపతలని నిమురుతూ ఆలోచిస్తూ కూర్చున్నాడు భాస్కరం.

తనకీ తల్లిలేదు. తండ్రి తిరిగి పెళ్లి చేసుకోలేదు. పాపకీ తల్లి లేదు. కాని సవతితల్లి ఉంది. పిన్నిపే రెత్తగానే భయంతప్ప మరోభావం ఏమీ కనుపించలేదీ పాపలో. ఎంత హింస అనుభవించిందో ఈ లేతమనస్సు!.... ఇంతకీ ఈ పాప తండ్రి ఎవరు? ఏ ఊరు ? ఈ రైల్లో పాప ఒక్కర్తే ఎలా ప్రయాణంచేస్తుంది ? కూడా ఉన్న వాళ్లేమయ్యారు ? రైలుప్రమాదం గురించి వినగానే ఆ తండ్రి ఆదుర్దాకలిగి ఇక్కడకు రాడా ?

వీటికి సమాధానం తెలియదు. పాపని చూస్తే వాళ్ల తండ్రి మధ్యతరగతి కుటుంబీకుడనీ, ఉన్నత కులం వాడనీ తెలుస్తూంది. తనని చూసి 'బాబాయ్!" అని ఎందుకు చెప్పింది ? తనలాంటి బాబాయి ఉన్నారా పాపకి ?

"ఏం పాపా ! బాబాయి ఎవరమ్మా ?"

"నువ్వేగా ...." అంటూ నవ్వి తన వళ్లో తల పెట్టి నుంచుంది. ఏమిటీ అనుబంధం ? చిత్రంగా ఉందే ! ఏమిటి చెయ్యాలి పాపని ?

ఎటూ ఆలోచన తెగక ఆ రోజంతా గడిచిపోయింది. కాలం గడచినకొద్దీ పాపకబుర్లు ఎక్కువయ్యాయి. తన కంఠం వదలటంలేదు. ఆ ఒక్కరోజులోనూ భాస్కరం గ్రహించిందొక్కటే! పాపకి మాతాపితరుల ప్రేమ ఏమిటో తెలియదు. ఆప్యాయంగా ఆదరించే చల్లని హస్తం ఆమెను తాకలేదు.

మర్నాడు కొంచెం ఓపిక కల్గింది భాస్కరానికి. ఈలోగా డాక్టర్ రెండు మూడు సార్లు వచ్చి వెళ్లినా పాపసంగతి ఏమీ పట్టించుకోలేదాయన. ఆ సాయంత్రం భాస్కరం ప్రయాణం అవుతూంటే డాక్టర్ వచ్చారతని గదికి. ప్రయాణం సంగతులన్నీ అయ్యాక .....

"అయితే ఈ పాప తాలూకు ఎవరూరాలేదు. ఏంచేద్దాం ?" అన్నా రాయన. భాస్కరం ఒక్క క్షణం ఆగి.

"పేపర్లలో ఫోటో వేయించి ప్రకటిస్తే కొంతపని జరుగుతుందేమో చూడాలి .... ఈలోగా పాప నాతో ఉంటుందిలెండి."

ఆశ్చర్యంగా చూశాడు డాక్టరు. "మీరు ఒంటరిగాళ్లే కదా ! అక్కడ .... ఆ పల్లెటూర్లో .... ఎలా చూస్తారీ పిల్లని ? .... ఏ శరణాలయంలోనో ఉంచేస్తే పోయేదానికి ...."

"వద్దండి ! శరణాలయంప్రసక్తి వద్దు. అదంటే నాకున్న అభిప్రాయం వేరు. ఈ పాప అంత దిక్కులేనిది కాదు. పైగా పాప నా దగ్గర

# పిన్నికాదు

బాగా అలవాటయింది. నాకూ కాలక్షేపంగా ఉంటుంది. పాపతాలూకు ఎవరైనా వస్తే నా దగ్గరకు పంపండి."

పాపను తీసుకుని రైలెక్కాడు భాస్కరం. మర్నాడే ఉద్యోగంలో ప్రవేశించాడు. ఆ ఊరు బాగా పల్లెటూరు కాదు. హాస్పిటల్‌లోనే అతనికి క్వార్టర్స్ ఉన్నాయి. ఇద్దరు కాంపౌండర్లు, ఇద్దరు నర్సులు, ఇద్దరు బోయ్‌లు, తోటమాలీ .... వీళ్లంతా తనకింద పనిచేసేవాళ్లు. తనకోసం ఓ వంటమనిషిని పెట్టుకున్నాడు. పాపనిగురించి తనేమీ బాధపడ నక్కర్లేకపోయింది.

పాపవిషయంలో అతని అనుమానం పూర్తిగా నిజమయింది. రైలుప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా, పాప ఫోటోతోసహా పేపర్లలో ప్రకటనలు వేయించినా, ఎవరూ పాపకోసం వెతకటంలేదు. పాప తండ్రితోటే ప్రయాణంచేసినట్లు చెప్తోంది. అయితే ఆయన ప్రమాదంలో చనిపోయాడా ? చనిపోయినవారి తాలూకు బంధువు

సుప్రసిద్ధ అమెరికన్ రచయిత మార్క్‌ట్వెయిన్ చిన్నతనంలో చదివిన స్కూలుటీచర్ ఒకసారి (అయన పెద్దవాడయిన తర్వాత) ఇలా అందిట: "శామ్‌కు (క్లెమెన్స్ ట్వెయిన్ అసలు పేరు) వచ్చిన కథలన్నీ నాకూ వచ్చు. అతను వాటిని కాగితం మీద రాసేశాడంతే," అని.

ఎల్. హనుమంతరావు (ఆదోని)

లంతా వచ్చి శవాల్ని గుర్తుపట్టి వెళ్లారుగదా ! వాళ్లలో పాపని గుర్తుపట్టినవారే లేరట ! అంటే పాపతండ్రి చనిపోయినవారిలో లేడు అన్నది నిశ్చయం. అయితే బ్రతికినతర్వాత ఆయనకి పాపకోసం వెతకాలన్న విచారం లేదా ? పాపని తీసుకువెళ్లాలని ఆయనకు లేదా ? పాపని వదుల్చుకోవటమే అతగాడి ఉద్దేశ్యమా ?

భాస్కరం ఒక నిర్ధారణకి వచ్చాడు. తన ఊహాకి పాప చెప్పిన తాడూ బొంగరంలేని మాటలే కొంత ఆధారం. పాపని ఏ అనాథశరణాలయంలోనో చేర్పించటానికి తండ్రి రైల్లో ఏ మహాపట్టణానికో తీసుకుపోతుండగా ప్రమాదం జరిగింది. విధివశాత్తు పాప తనదగ్గరకు చేరింది. ఏవిధంగానైతేనేమి, వారి ఆశయం నెరవేరింది కనుక ఇక పాపకోసం ప్రయత్నించి అతగాడు రాడు. అయితే ఈ పాప బాధ్యత తనే వహించాలా ? తనకేమి అవసరం ? తనైనా చిన్నవాడు. ఇంకా జీవిత మాధుర్యాలనేమీ రుచిచూడలేదు. ఈ రకమైన బాధ్యత తన జీవితానికి అనవసరపు బరువే! కాని

అమాయకమైన పాప కళ్ళు—ఆదరణ, ఆప్యాయత ఎరుగకుండా పెరిగిన ఆ చిన్నారి ముఖం ? ముద్దు పలుకులు—పాప అంటే ఏదో అభిమానం ప్రేమ కల్గించాయి. శరణాలయానికి వప్పగించటంతో తను కూడ పాపతండ్రి ఆశయాన్ని బలపర్చినట్లవుతుంది తప్ప తన మానవత్వాన్ని బయటపెట్టదు. ఆ తలపుని ఎన్నడో త్రుంచివేశాడతను.

ఓరోజున ఓ ముసలాయనా, ఓ ముసలావిడా వచ్చారు భాస్కరం ఇంటికి. వాళ్ళు అతనికి ఏమీ కారు, కాని వాళ్లకన్నా బంధువు లెవ్వరూ లేరు. వాళ్లని చూడగానే భాస్కరానికో సంకల్పం కల్గింది. పాపని వాళ్ల పెంపకంలో ఉంచితే ? వాళ్లకి యింట్లో చిన్నపిల్ల లెవ్వరూ లేరు. ఉన్న ఒక్క కొడుకు భాక్రాడాంలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కూతురు మొగుణ్ణి పోగొట్టుకుని పెద్ద ఆస్తితో పుట్టింటికి చేరింది. పాపవిషయం చెప్పగానే ముసలాయనా, ముసలావిడాకూడా వెంటనే అంగీకరించారు—తమకీ, తమ విధవకూతురికీ కాలక్షేపంగా ఉంటుందని. కాని అసలు తంటా వాళ్లు వెళ్లిపోయేరోజునగాని తెలియలేదు.

"పాపా ! తాతయ్యతో వాళ్ళ ఊరు వెళ్తావా ?" అని అడిగాడు భాస్కరం పాపని.

"నువ్వో ? మరి నువ్వు వత్తావా ?" అంది ఆశతో చూస్తూ.

"ఇక్కడ ఆస్పిటలుకి వస్తారే .... వాళ్లంతా నన్ను రానివ్వరమ్మా! ముందు నువ్వెళ్లు. తర్వాత వీళ్ళెవరూ చూడకుండా నేనూ వచ్చేస్తాను"

"నేనూ అప్పుడే వత్తాను." నిర్ధారణగా అంది పాప. ఇంక శతవిధాల ప్రయత్నించినా పాప వినలేదు. బలవంతంగా పంపివేస్తే ఏమౌతుందో తను ఊహించగలడు. ఆఖరుసారిగా ప్రయత్నిస్తూ భాస్కరం ....

"చూడమ్మా పాపా ! తాతయ్యతో వెళ్తే బోల్డు బొమ్మలు, బిస్కట్లు, చాకలెట్లు .... అన్నీ ఉంటాయి. పైగా అక్కడ మరోకావిడ ఉంది. ఎంత మంచావిడో ! నీకు బోల్డు కథలు చెప్తుంది. ఎవరో తెల్సా ?"

'ఎవరు ?' అన్నట్లు చూసింది పాప. అప్రయత్నంగానే .... "పిన్ని !" అన్నాడు భాస్కరం వత్తి పలుకుతూ. అనగానే పాప ఆనందంతో చప్పట్లుకొడ్తుం దనుకున్న భాస్కరానికి పాప ముఖం చూడగానే శరీరం భయంతో ఝల్లుమంది. "పాపా! పాపా!" అని గబగబ కుదిపేశాడు కంగారుగా. పాప తేరుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

అప్పట్నించి ముసలాళ్లిద్దర్నీ చూడగానే భయంభయంగా తప్పించుకు తిరిగేది పాప వాళ్లు వెళ్లిపోయేవరకూను. తన ఉద్దేశ్యం తలక్రిందులవడంతో భాస్కరానికి ఆరాటం పట్టుకుంది. ఈపాప ఎల్లకాలం తనతోనే ఉండిపోయే పరిస్థితు లేర్పడినట్లు మొదటిసారి అతను గ్రహించాడు. ఈ పాప తనకి విడదీయరాని సమస్య అయిపోయింది. ఎందుకీపాపని చూస్తే ఇంత జాలి, వాత్సల్యం కలుగుతున్నాయి ? కన్నతండ్రికే లేని

మమత తననెందు కావహించింది ? రేపు 'లలిత' తన జీవితభాగస్వామినిగా తనలో ప్రవేశిస్తే ఏమని సమాధానం చెప్పాలి ?

లలితవిషయం స్మరణకు రాగానే భాస్కరం మనస్సు మరోలోకంలోకి పోయింది. లలిత కోసం ఎన్నాళ్లీ తపస్సు ? అనుకున్న ప్రకారం తన చదువు పూర్తయి ఉద్యోగంలో ప్రవేశించాడు. లలితకూడ పరీక్షలు అయిపోయాయి. లలిత తండ్రి 'కృష్ణారావు' గారు పెళ్లి ముహూర్తానికి కంగారుపడుతూ తనకు ఉత్తరాలు వ్రాస్తున్నాడనీ, ఎప్పుడో వెంటనే వీలు చూసుకుని వెళ్లి ముహూర్తం పెట్టిస్తానని ముసలాయన చెప్పాడు తనతో చివరకు తన లలిత తనవద్దకు చేరేరోజులు సమీపించాయి. ఆమెవద్దనుంచి ఉత్తరం వచ్చి చాలారోజులైంది. రైలుప్రమాదం జరిగినట్లు తెలిసి లలిత అనుభవించిన వేదన, కంగారు ముస లావిడ తనతో చెప్తుంటే తన గుండెలలో నిండిన ప్రేమవాహిని పొంగి పొర్లిపోయింది. తన దగ్గర్నించి కులాసాగా ఉన్నట్లు ఉత్తరం వచ్చాక మామూలుగా లేచి తిరిగిందట.

ఇంతవరకు పాపనిగురించి లలితకి ఏమీ వ్రాయలేదు. ఇప్పటి పరిస్థితుల్లో పాపవిషయం లలితతో సంప్రదించక తప్పలేదు. ఏదోవిధంగా పాప తనవద్దనుంచి వెళ్లిపోతుందనీ, ఎక్కడికో, ఎవరివద్దకో, పంపివేద్దామనీ ఉద్దేశ్యంతో తనింత వరకు ఉపేక్షించాడు. కాని రేపోమాపో తన బాధ్యతతో పాటు, ఈ పాప బాధ్యతకూడ తీసుకోవలసిన తన లలితకి ఇప్పుడైనా ఉన్నది ఉన్నట్లు వివరించి చెప్పి, చివరినిర్ణయం ఆమెకే వదిలివేద్దామనుకున్నాడు భాస్కరం.

ఆవిధంగానే లలితకి పెద్ద ఉత్తరం వ్రాశాడు. తీరా ఉత్తరం పోస్టుచేసి వచ్చాక తన ననేక సందేహాలు, అనుమానాలు ఆవరించాయి. 'తనమీద లలిత ఏమీ అనుమానించదుకదా ?' అనుకున్నాడు. అటువంటి ఆలోచన రాగానే అతని హృదయం భయంభయంగా గుబగుబలాడింది. ఇంతవరకూ నిర్మలంగా, నిష్కల్మషంగా ఉన్న తమ ఇద్దరి హృదయాలలోనూ ఈ అనుమానభూతం అఖాతం ఏర్పరచదుకదా అని వాపోయాడు.

కాని లలితదగ్గర్నించి వచ్చిన జవాబుతో అతని అనుమానాలన్నీ పటాపంచలవటమే కాకుండా అతనిలో నూతన్నోత్సాహం ప్రవేశించింది. పదేపదే ఆ ఉత్తరం చదువుకున్నాడు. చదివినకొద్దీ అతని గుండె తేలికపడింది. అందులోనూ 'తమ్ముడితో కలిసి వచ్చే ఆదివారం పాపని చూడటానికి వస్తున్నా' నని కూడా వ్రాసింది. ఈ ఉద్యోగంలో చేరేముందు కొన్ని రోజులక్రితం చూసిన లలిత—ఇన్నాళ్లకు తనని చూడ్డానికి వస్తోంది. ఎన్నాళ్లయిందో కదా !' అనుకున్నాడు భాస్కరం.

ఆరోజా లలిత వస్తానన్నరోజా. ఆ స్టేషనుకి బండి రాత్రి 10 గంటలకు వస్తుంది. స్టేషనుకి ఊరికి మూడు నాలుగు మైళ్ల దూరం. తను స్టేషన్‌కి వెళ్లాలి. అప్పుడే సాయంత్రం 5 గంటలు దాటింది. ఆరోజంతా ఎంతో హుషారుగా గడిచింది భాస్కరానికి. పాపతో ఎన్నో కబుర్లు చెప్పాడు. లలితనిగురించి పాప కేమని చెప్పాలి ? అప్పటివరకూ ఏమీ చెప్పలేదు పాపకి. 'వచ్చే వ్యక్తి పాప కెటువంటి బంధువో తెలియాలి కదా !' అనుకున్నాడు భాస్కరం.

* * *

"పాపా ! ఇవాళ మనింటికి ఒకరు వస్తున్నారు. నీకు మంచిమంచి బొమ్మలు, బిళ్లలు .... మరి .... రిబ్బన్లు .... అన్నీ తెస్తారు ...."

"ఎవలూ ? నీకూ తెత్తాలా బొమ్మలు ....?"

పాపకేదో సమాధానం చెప్పేలోగా "డాక్టరుగారోయ్ ! త్వరగా రండి బాబయ్యో!" అంటూ ఏడుస్తూ పిలిచేపిలుపు విని వీధిలోకి పరుగెత్తాడు భాస్కరం.

ఆ వచ్చినవాళ్లు హాస్పటల్‌కి వెనకవైపున ఉన్న గూడెంలో ఉండే మాలవాళ్లు. నాలుగయిదు సంవత్సరాల పిల్లని భుజంమీద వేసుకుని తీసుకు వచ్చారు. పక్కగా కొందరు స్త్రీలు పెద్దగా శోకాలు తీస్తున్నారు. భాస్కరాన్ని చూస్తూనే ఆపిల్లని అతని పాదాలదగ్గర పడేసి, "బాబయ్యా ! దాని పాణం కావండి. మీ చేతులో పడేశాం" అంటూ వచ్చిన పెద్దలు వినయంగా నిలబడ్డారు. స్టేషన్‌కి వెళ్లేదారిలో పంటకాలవ ఉంది. మామూలు రహదారికోసం కాలవమీద వంతెన ఎలాగూ ఉంది. కాని గూడెంలోవాళ్లు స్టేషన్‌దగ్గర ఉన్న పాలాలకి వెళ్లటానికి దగ్గరదారిలో కాలవకి తాటిపట్టీలు వేశారు. ఆ తాటిపట్టీలు దాటుతూ ఈ పిల్ల కాలవలో పడిపోయింది. వెంటనే చూసి పక్కన పనులుచేసుకుంటున్నవాళ్లు బయటకుతీసి, భాస్కరం దగ్గరకు తీసుకువచ్చారు. నీళ్లు బాగా త్రాగివేసిందే, గాని ప్రాణభయంలేదు .... వెంటనే హాస్పటల్‌వైపు పరిగెట్టాడు భాస్కరం వాళ్లని కూడా రమ్మని .....

వడ్రంగి పిట్ట ఒక పెద్ద తాటి చెట్టు మీద వాలి ఒకసారి ముక్కుతో కొట్టింది. అదే సమయానికి ఆ చెట్టుమీద పిడుగుపడి అమాంతంగా కూలిపోయింది. "ఔరా, నా కింత బలముందా?" అని ఆశ్చర్యపోయింది వడ్రంగి పిట్ట.

జి. అంకయ్య (నిడుబ్రోలు)

తిరిగి యింటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలు దాటింది. పాప భోజనం చేసేసి తోట మాలితో కబుర్లు చెప్తోంది. భాస్కరం గబగబ తనగదిలోకి వెళ్లిపోయి, అన్నం వడ్డించమని ఒక్క కేక పెట్టి—నీళ్లకి తయారయి బాత్‌రూంలోకి వెళ్లిపోయాడు. గబగబ నీళ్లు పోసుకొని, బట్టలు వేసుకుని, భోజనాలగదికి బయలుదేరుతూండగా తనవైపు వస్తున్న పాపని చూసి,

"పాపా ! అన్నం తిన్నావా ? నిద్రపోకు—నువ్వూ స్టేషన్‌కి వద్దువుగాని. త్వరగా మంచి గౌను తొడుక్కో. అప్పుడే చాలా టైమయిందే .... త్వరగా తెములు పాపా ! ఇప్పుడు పిన్ని వస్తుంది రైల్లో ...."

అని హడావిడిగా అనధోరణిలో తాను వెళ్లిపోయాడు భాస్కరం వంటింట్లోకి.

అంతవరకూ అతని కంగారు చూసి కంగారు పడిపోయిన పాప, ఆ ఆఖరుమాటతో హఠాత్తుగా కొయ్యబారిపోయింది. పెద్దపులిని తల్చుకున్న లేడిపిల్లలాగ వణికిపోయింది.

భాస్కరం భోజనం హడావిడిగా ముగించి, తన గదిలోకి పరుగెత్తి, త్వరత్వరగా డ్రెస్ వేసుకుని బయటకు వచ్చాడు. వంటఇంట్లో గిన్నెలు సర్దుతున్న శబ్దంతప్ప ఏ అలికిడీ లేదు. ఏదో కొత్తగా అనిపించింది భాస్కరానికి. "పాపా !" అని కేక పెట్టాడు. అన్ని గదులూ వెతికాడు. చివరకు వీధిలోకి వచ్చి చూశాడు. కాని ఎక్కడా లేదు పాప. "పాపా ! పాపా !" అని కేకలు పెట్టాడు. ఎవ్వరూ పలకలేదు. తన కేకలకి పరుగెట్టుకు వచ్చిన తోటమాలిని అడిగాడు పాపని గురించి. మాలికూడా చూడలేదు పాపని. ఇద్దరూ కలసి మళ్లీ యిల్లు, దొడ్డి, హాస్పటల్‌వైపు .... అంతా వెతికారు.

'పాప ఏమైనట్లు ?' భాస్కరానికి భయం ఆవహించింది. ఆ క్షణంలో తాను ఆఖరిసారిగా అన్న మాట గుర్తుకి వచ్చింది. "ఇప్పుడు పిన్ని వస్తోంది రైల్లో...." తన లలిత పాప కేవిధమైన పిన్ని అవుతుందో చెప్పకపోవటంవల్ల ఎంత అనర్థం కల్గింది ? ఒక్కసారి బయటకు పరిగెట్టాడు. వెనక వస్తున్న మాలిని మరోవైపుకి పరుగెత్తించాడు. భాస్కరం కంగారు మనస్సు ఓరకమైన అనుమానాన్ని రేకెత్తించింది. అతను కాలవవైపు పరుగెత్తాడు. 'స్టేషన్‌వైపు రోడ్డుమీద ఎవరో చిన్నపాప వెళ్తుంటే చూశానని' ఓ బండివాడు చెప్పగా అటు పరుగెత్తాడు.

మెదడులో అనేక అనుమానాలు మొలుస్తున్నాయి. రైలు వచ్చి వెళ్లిపోతున్నట్లు కూత వినబడిం దతనికి. లలితని స్వయంగా రిసీవ్ చేసుకోలేకపోయానని ఒక్కసారి శిలగా అనుకున్నాడు. ఈసమయంలో పాప ఏమైంది ? ఎక్కడకు వెళ్తుంది ? ఎందుకు తనని వదిలి వెళ్లిపోతోంది ? అనే మథన ఎక్కువైపోతోంది. 'పాపా! పాపా ! వెనక్కిరా' అని అతని హృదయాంతరాళాల్లో ఆక్రోశం వెల్లువలై వెలువడింది. 'పాపా !' అని నాలుగైదుసార్లు కేకలు వేశాడు. మినుకుమినుకుమంటున్న నక్షత్రాలు తప్పితే ఆ రోడ్డుమీద మరే వెలుగూ లేదు. వంతెన — కాలవ ముందుగా ఉన్నాయి. కాలవ .... అయ్యో! కాలవ...! కాలుజారి .... లేకపోతే దారితప్పి .... పాప కాలవలో పడిపోదుకదా ? తనదగ్గరకు సాయంత్రం తీసుకురాబడిన ఆ హరిజన బాలికముఖం అతని కళ్ల ముందు ఆడింది. అతను వణికిపోయాడు, భయంతో. 'పాపా !' అని గట్టిగా కేకవేస్తూ ఆవేశంతో పరుగెత్తాడు. కొంతదూరం వళ్లు తెలియకుండా పరుగెత్తిన భాస్కరానికి మరికొంత దూరంలో మినుకుమినుకు మనే ఓ గుడ్డిదీపం కన






## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నదీ, మీ సరియైన దర్శనమునుగురించీని మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్నూ వుంచి నే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములలో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా ప్రూఫ్ పైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W P.) JULLUNDUR CITY

# పిన్నినికాదు

బడింది. మరింత వేగంతో, బలాన్ని కూడదీసుకుని పరుగెత్తాడు.

అక్కడొక బండి ఆగింది. బండిప్రక్కగా రోడ్డుమీద ఎవరో ఉన్నట్లు వారి ఆకారాలనిబట్టి గ్రహించి అలా నడిచాడు భాస్కరం.

"ఆ దీపం ఇలా తీసుకురా !"

ఆ కంఠం తనకు సుపరిచితమే! గబగబ దగ్గరకువెళ్లి "లలితా !" అన్నాడు ఆయాసంతో ప్రక్కన ఉన్న లలితతమ్ముణ్ణి గుర్తించాడు.

"భాస్కర్ !" అంది లలిత ఆయోమయంగా.

బండివాడు తెచ్చిన దీపం వెలుగుతో అక్కడ పరిస్థితి అర్థమైంది భాస్కరానికి. "పాపా ! .... పాపా ! కళ్లుతెరు .... " పిచ్చిపిచ్చిగా కేకలుపెడుతూ లలిత వడిలో పడిఉన్న పాపని కుదిపేశాడు ఒక్కసారిగా.

"భాస్కర్ ! నా అనుమానం నిజమైంది చూశావా, దూరంనుంచి 'పాపా !' అనే కేకలు వినబడ్డాయి మాకు. ఇక్కడ పడిపోయి ఉంది పాప. ఏదో అజ్ఞాతంగా అనిపించింది 'మన పాపేనా!' అని .... "

పాపని పరీక్షించి చూశాడు భాస్కరం.

"పాపా ! చూడమ్మా .... ఇలా చూడు" అంటూ పాప అరిచేతుల్ని రాస్తూ కూర్చున్నాడు. కొంతసేపటికి పాప నెమ్మదిగా కళ్లుతెరచి ఎదురుగా ఉన్న భాస్కరాన్ని చూసింది. ఆ మసక చీకట్లో కూడా పాపకళ్లలోని భయాన్ని గుర్తించాడు భాస్కరం. పాప కళ్లలోంచి కారిన వెచ్చని కన్నీళ్ల ఆనవాళ్లు స్పష్టంగా కనబడుతున్నాయి.

"ఇదుగోనమ్మా పాపా ! ఎందుకు భయపడ్డావ్ ? పిన్ని అంటే మీ పిన్ని కాదమ్మా .... ! ఇలా చూడు. చాలా మంచి దీ పిన్ని. నీకు బొమ్మలు చాకలెట్లు తీసుకొచ్చింది....."

అనునయంగా అంటున్న ఆ మాటలకు కూడ పాప వణికిపోవటం గమనించింది లలిత....

"కాదమ్మా పాపా ! నేను పిన్నిని కాదు. అమ్మనే! నా బంగారుతల్లీ .... ఇలా చూడమ్మా .... అమ్మకేసి చూడవ్ ? .... "

నెమ్మదిగా కళ్లు విప్పింది పాప. చల్లని ఆ హస్తస్పర్శలో, మెత్తని ఆ వడిలో, వాత్సల్యపూరితాలైన ఆ పలుకులలో ఏ మాధుర్యం రుచిచూసిందో .... "అమ్మా !" అని ఏడుస్తూ లలిత మెడని రెండు చేతులతోనూ వాటేసుకుంది.

భాస్కరం కళ్లు తుడుచుకున్నాడు పక్కకు తిరిగి.

"నీకు అన్యాయం తలపెట్టాను పాపా ! నిన్ను వదుల్చుకోటానికే ఇన్నాళ్లు ప్రయత్నించాను. స్వంతబిడ్డలాగ చూచుకోడానికి నా బుద్ధి ఆలోచనే చెయ్యలేదు. ఇక నిన్ను మానుంచి ఎవ్వరూ విడదీయలేరు .... " అనుకుంటూ లలితని చేరవేశాడు నెమ్మదిగా......

★